

# అంతస్తుకి అటు ఇటు

ముక్తేవి భారతి

విమానం కదలగానే రాజారాం కారు స్టార్టు చేశాడు.

క్లబ్బు కెళ్లాలనుకున్నాడు, కాని ఎందుకో వెళ్లా లనిపించలేదు. ఒక్క క్షణం ఆలోచించి ఇంటి దారి పట్టాడు.

"వెళ్లిందా అమ్మాయి" పక్కకు ఒత్తిగిల్లుతూ అడిగింది రాధారాణి.

'ఆ' సిగరెట్టు పొగ గాలిలోకి వదులుతూ భార్య పక్కన కుర్చీలో కూలబడ్డాడు రాజారాం.

* * *

"ఆయనకి ఇష్టం ఉండదు నాన్నా... నాన్నా కొన్ని నెలలు పోయాక చిన్నబాబుని తీసుకువస్తాను కదూ... ఏం నాన్నా!" చిట్టితల్లి నెమ్మదిగా చెవిలో చెప్పిన మాటలు మళ్ళామళ్ళా ధ్వనిస్తూ మనసును ముక్కలుముక్కలు చేస్తున్నాయి. సింహంలాంటి రాజారాం, సముద్రంలా గంభీరమైన రాజారాం, డబ్బుతో కొనలేనిదేదీ ప్రపంచంలో లేదని ధృఢంగా నమ్మే రాజారాం కళ్లలో తిరిగిన నీళ్లు మొదటి సారిగా తుడుచుకున్నాడు.

* *

అందాల బొమ్మలా వుండే ఇందిరని పెళ్ళిచేసుకోవాలని ఎందరో అనుకున్నారు. మరెందరో ఇంటికి తామే వచ్చి అడిగారు. కాని ఇందిర పెళ్ళి గురించి ఆలోచిస్తుందో లేదో కాని రాజారాం ఒక్కసారికూడా అమ్మాయి పెళ్ళి గురించి మనసులో అనుకోలేదు. తనకున్న ఒక్క కూతురికి పెళ్ళిచేసి పంపేస్తే ఇల్లు చిన్నబోదూ—

'అయితే పిల్లకి పెళ్ళిచేయరా' అంటుంది రాధారాణి లిప్‌స్టిక్ పెదాలు తడుపుకుంటూ.

"ఒకవేళ పెళ్ళిచేస్తే— ఆ అబ్బాయి ఈఊళ్ళోనే వుండాలి. మా చిట్టితల్లిని ఎప్పుడు పంపమంటే అప్పుడే పంపాలి — ఒక్క పని చేయించకూడదు, ఒక్క మాట అనకూడదు, విన్నావా ! అది ఎవరి కూతురనుకున్నావ్! రాజారావ్స్ డాటర్" రాజారాం గర్వంగా చిట్టితల్లికేసి చూసాడు. 'యస్ డాడీ" ఫెమీనా తిరగేస్తూ, భుజాలమీదపడ్డ జుట్టు ఓసారి సరిచేసుకుంటూ తండ్రికేసి చూసింది ఇందిర.

* * *

అదృష్టం అనుకోకుండా కలసివచ్చేసింది.చాలా గొప్పవారి సంబంధం ఇందిరకి ఖాయమైంది.పిల్లవాని తాత జడ్జి పదవిలో ఎన్నో ఏళ్లు చేసి రిటైరయ్యాడు. పిల్లవాని తండ్రి మిలటరీలో పెద్ద ఆఫీసరు. పిల్లాడు ఓ పెద్ద కంపెనీలో మేనేజరు. వాళ్లకున్న ఆస్థి, అంతస్థు సందేహం లేకుండా చాలా పెద్దవి. ఎంతోమంది కావాలని కోరుకునేవి.

'వాళ్ల అంతస్థుకి మనం తగం నిజంగా. కాకపోతే పిల్ల అదృష్టం. ఎన్నో పెద్ద పెద్ద సంబంధాలు వస్తే కాదనుకుని మన పిల్లని చేసుకోటం...' రాధారాణి మాట పూర్తికాకుండానే—

"అంతస్థంటే" రాజారాం ఎసుగ్గా రాధారాణి కేసి చూశాడు. "అదే— అంతస్థంటే— అదేనండీ— మనకన్నా వాళ్ళు చాలా గొప్పవాళ్ళనా మరి...'

రాజారాం మనసును సమాధానపరచుకో ప్రయత్నిస్తున్నాడు. వాళ్లు చాలా గొప్పవాళ్లు — అయితే మాత్రం మా అమ్మాయి ఎంత అందమైందీ! అందుకే వచ్చి అడిగి, నన్ను ఒప్పించి మరీవెళ్లారు— రాజారాం నల్లని మీసాలు ఓసారి సరిదిద్దుకుని గర్వంగా నవ్వుకున్నాడు. నా అంతస్థు మాత్రం ఏం తక్కువని— తన్ను తానే ప్రశ్నించుకున్నాడు.

* * *

ఇందిర పెళ్ళి చాలా గొప్పగా జరిగింది. కాని కేవలం ఇందిరలాంటి అందమైన పిల్ల కోడలుకావాలని వాళ్లు తనతో సంబంధం కలుపుకున్నారు అని రాజారాం మనసుకి ధృఢంగా తెలిసిపోయాక ఎక్కడనుంచో కిందకు పడిపోయినట్లు కృంగిపోయాడు.

అమ్మాయిని చూడ్డానికి రాజారాం రెండు మూడు సార్లు వెళ్ళాడు. తన రాకపోకలు గుర్తించనట్లే వుండేవాడు అల్లుడు. "పోన్లే— నా పిల్లకోసం నేను వస్తున్నానంతే" పేలవంగా నవ్వుకుంటూ మెట్లెక్కేవాడు రాజారాం చాలాసార్లు.

* * *

రాజారాం ఎదురుగా బల్లమీద ఉత్తరం రెపరెప లాడుతోంది. ఈ ఉత్తరం రాయబట్టే వెళ్లి అమ్మాయిని ఎయిర్‌పోర్టులో చూడనైనా చూడగలిగాడు. ఒక్క వారం రోజులయినా తనదగ్గరుంచమని రాస్తే, ఇంచుమించుగా బతిమాలుతున్నట్టుగా రాస్తే విమానం విమానాశ్రయంలో కొద్దిసేపు ఆగుతుంది కాబట్టి అక్కడికి వచ్చిచూచి వెళ్లండనే సమాధానం !

మళ్లా ఓమాటు ఆ ఉత్తరం చదువుకుని పళ్ళు కొరుక్కుని, కాసేపు గదిలో అటూ ఇటూ పచార్లు చేసి ఆ ఉత్తరాన్ని చెత్తకాగితాల బుట్టలో విసిరేసాడు రాజారాం. తన తాహతు వాళ్ళకి తగదు— మొన్న అల్లుడు పనిమీద ఈ వూరొచ్చి హోటల్లో దిగి వెళ్లిపోయాడు — ఏమిటీ అహం — డబ్బు, డబ్బు — రాజారాంకి క్షణం మతిపోయినట్లే అనిపించింది.

విమానం ఎక్కి వెళ్లిపోయే అమ్మాయి వెనక్కి వెనక్కి తిరిగి నాన్నని చూసి పేలవంగా నవ్వటం, 'ఆయనకి ఇష్టంలేదు నాన్నా' గొంతు తగ్గించి నెమ్మదిగా చెప్పటం ఎంత మరిచిపోవాలన్నా మరిచిపోలేకపోయాడు రాజారాం. ఆ నిముషంలో ప్రపంచం అంతా అంధకారంగా అనిపించింది. మనిషికి అంతస్థే కొలతబద్ద అయితే ఈ ప్రపంచంలో రకరకాల

మనుషులు ఎలా బతికిపోతున్నారు హాయిగా - రాజారాం ఆ చీకటి గదిలో అలాగే కూర్చుండిపోయాడు.

*    *    *


చిన్న వీధి బడి మాష్టారు కొడుకుగా పెరిగాడు రాజారాం. చిన్న పెంకుటింట్లో అమ్మ, నాన్న, తాత, బామ్మ, ఇద్దరన్నయ్యలు, ఇద్దరు చెల్లెళ్ళు, తను — అంతా వుండేవారు. అమ్మ పెట్టిన చద్ది అన్నం తిని పలక పట్టుకుని లాగు ముడి వేసుకుంటూ వీధిబడికి పరిగెత్తేవాడు. చిన్న లాంతరు ముందు కూచుని చదువుకున్నాడు. బాగా చదువుకుంటున్నాడని తాతయ్య మెచ్చుకునేవాడు. "ఏం చదువో — వాడి కడుపుకి వాడు సంపాదించుకుంటే చాలు" అనేది తల్లి ఏ మూతి దగ్గరో పని చేసుకుంటూ.

అలా అలా చిన్న పల్లెటూరిలో, చిన్న ఇంట్లో, చిన్నబడిలో, మరీ చిన్న బతుకులో కొంచం కొంచం పెరిగాడు.

మామయ్య తనకి కాలేజీ చదువు చెప్పిస్తానని పట్నం తీసుకొచ్చేవరకు పట్నం ఎలా వుంటుందో తెలియదు. చాలా కష్టపడి చదువుకున్నాడు. అదృష్టం కలిసివచ్చింది. — అంతే,

జీవితం కొత్తమలుపు తిరిగింది. మంచి ఉద్యోగంలో ప్రవేశించడం ఆలస్యం, పిల్లనిస్తామంటూ వెంటబడ్డవాళ్ళెందరో. రాధారాణి తండ్రి జానకిరామయ్య తనగురించి విని, వారం రోజులు తిరగకుండా పెళ్లి సంబంధం కుదిర్చేసాడు. తనని కొనేసుకున్నాడు.

తను ఇంకో మెట్టు పైకి వెళ్లిపోయాడు. గొప్పవాడైన మామగారు — ఆరోజు తనని వెంటబెట్టుకుని మరీ పెద్ద హోటలులో డిన్నరిచ్చినపుడు, తనవాళ్ళందరూ నిత్యం తినే తిండి, తనవాళ్ళ బ్రతుకులు కళ్ళముందు నిలచి, అక్కడ తియ్యతియ్యని పదార్థాలు గొంతు దిగక తికమకపడ్డ రోజు ఎలా మరిచిపోగలడు! మొదట్లో కొన్ని రోజులు తల్లితండ్రులకి నెలనెలకి డబ్బు పంపేవాడు. వారం వారం ఉత్తరం రాసేవాడు. కాని తర్వాత తర్వాత




పూర్తిగా మారిపోయాడు రాజారాం. 'తన అదృష్టం తనది' అది సర్ది చెప్పుకుంటూ బతికేయడం అలవాటు చేసేసుకున్నాడు. తన ఇంటిచుట్టూ పూలమొక్కలు, పెద్దబంగళా, మరీ పెద్దకారు, తనకోసం చుట్టూ చుట్టూ తిరిగే రకరకాల మనుష్యులు, తన అంతస్థు — ఓహో — గొప్ప గొప్పవాళ్ళే తన ఆత్మీయులని నమ్మేస్తూ, తన డబ్బుతో ఈ ప్రపంచాన్ని కొనేయగలనని గాఢంగా నమ్మేస్తూ — ఓహో — ఎన్నేళ్ళు, ఎన్నెన్నేళ్ళు బతికేసాడు తను — మనిషి ప్రేమకి, ఆప్యాయతకి, త్యాగానికి — ఇలాటి ఎన్నిటికో ప్రపంచంలో కొంతైనా విలువ వుందని గుర్తించాల్సిన అవసరమే లేకుండా హాయిగా బతికేసాడు. చుట్టరికాన్ని, స్నేహాన్ని కూడా అంతస్థుల తూకంలో తూచి ఖరీదు కట్టేసాడు — ఓహో ఎంత పెరిగిపోయాడు తను!!

కానీ మరీ పెరిగిపోయిన రాజారాం. హాయిగా నవ్వడం, కళ్ళు మూసుకు సుఖంగా నిద్రపోవడం మరిచిపోయాడు. నిజానికి తను మనిషిగా బతకడమే మరిచిపోయాడు — కానీ బతికేసాడు — ఎన్నేళ్ళు — ఎన్నెన్నేళ్ళు!!

*    *    *

తన వాళ్ళని తలుచుకోగనే రాజారాం కళ్ళు చెమర్చాయి. తను చిన్నప్పుడు పెరిగిన ఇల్లు, తనతో బాటు ఒకే కంచంలో తిన్న అన్నయ్య, తన చిన్నారి చెల్లాయి— రాజారాం ఒళ్ళు పులకించింది. తన తనకోసమే ఎదురుచూసే వాళ్ళంతా ఏరీ? ఎవరు దొంగో, ఎవరు దొరో తెలియులేని ఇన్నివేల అనుబంధాల మధ్య తనవాళ్ళేరీ!?

ఇంత పెద్ద రాజారాం చీకట్లో కన్నీళ్లు తుడుచుకున్నాడు. పెద్ద బంగళా, మరీ పెద్ద కారు, పూలతోట, ఇంకా ఎన్నోఎన్నో తననే వెక్కిరిస్తున్నాయనిపించి కదలిపోయాడు.

చిట్టి తల్లిని అల్లుడు పంపలేదని కృంగిపోయిన తను ఎన్ని అనుబంధాల్ని తేలిగ్గా వదిలేశాడు ఇంతవరకు— రాజారాం దీర్ఘంగా నిట్టూర్చాడు. హోదా మనిషిని పెద్దవాణ్ని చేస్తుంది. కాని దానితోబాటు మనసుకూడా పెరిగితేనే. అలా కాకపోతే- ఎన్నిఉన్నా అన్నీ వృధా వృధా!!

డబ్బు మనిషయిపోయి తను బతికిన బతుకు అసహ్యంగా, భయంగా కనిపించి కళ్ళు గట్టిగా మూసుకున్నాడు రాజారాం.

ఆ రోజు,

"ఊరెడుతున్నాను" సూట్‌కేసులో బట్టలు సర్దుకుంటూ రాజారాం.

"ఊరేమిటి" ఆశ్చర్య పోయింది రాధారాణి. "అమ్మాయి దగ్గరకా?"

"కాదు! అమ్మ దగ్గరికి" రాజారాం రాధారాణి ముఖం చూశాడు.

"బాగుంది మీ హాస్యం. అమ్మాయి కోసం బెంగపడుతున్నారు అసలె— దీనికితోడు ఆ ఊరెళ్ళి ఆ కారాలు తింటూకూచుంటే ఇంక మీ ఆరోగ్యం—" రాధారాణి మాట పూర్తికాలేదు.

"అక్కడుండి తిన్నంతకాలం మనిషిలాగే ఉన్నాను. అవన్నీ మానేశాక ఇలా మారిపోయాను" విరాగిలా ఓ నవ్వు నవ్వి గబగబా ముందుకు అడుగు లేసాడు రాజారాం.

*    *    *

తను చదువుకున్న చిన్న వీధి బడి దాటిపోతుంటే ఒళ్లు గుచ్చ్రొడిచింది. గబగబా నడిచి ఇంటిముందు ఆగాడు రాజారాం. కిటికీలోంచి తొంగిచూశాడు. అమ్మ దొడ్లో తులసికోట దగ్గర తల పెట్టుకు నిద్రపోతోంది. నాన్న ముందు వరండాలో గురకతీసి నిద్రపోతున్నాడు. రాజారాం ఆదేపనిగా చూస్తున్నాడు లోపలికి. దీపపు వెలుగులో పక్కగ ఏదో చదువుతున్న అన్నయ్య కనిపిస్తున్నాడు. రాజారాం ఇక ఆగలేక గబగబా తలుపుతట్టాడు.

"ఎవరు కావాలండీ" తియ్యని చిన్న గొంతు విని పులకించిపోయాడు.

"మీరంతా" అప్రయత్నంగా అనేశాడు.

ఇంట్లో అందరూ రాజారాం చుట్టూ మూగారు. అనుకోకుండా రాజారాం రావటం అందరికీ ఆశ్చర్యంగానే వుంది.

"ఇలా కూచో" మంచం చూపించాడు తండ్రి.

"మీ ఆవిడ కులాసాయేనా" అంది అమ్మ.

రాజారాం నవ్వాడు.

క్షణంలో ఇంట్లో అందరూ ఏదో హడావిడి పడుతున్నారు. అమ్మ రహస్యంగా అన్నయ్యకి ఏదో చెప్తోంది చిన్నవాడు దొడ్డిగుమ్మంలోంచి వెళ్ళి మళ్లా లోపలకొచ్చాడు.

రాజారాం అన్నీ గమనిస్తూనే ఉన్నాడు. తనకి అతిథి మర్యాదలు చేయడానికి వాళ్ళ పడుతున్న తాపత్రయం— రాజారాం కళ్లల్లో నీళ్ళ తిరిగాయి.

చల్లారిపోయిన అన్నం మీలాగ నేనూ తినగలనని, నేనూ మీలాగ నేలమీద పడుకోగలననీ, నేనూ మీ అందరిలో ఒకడనేనని, అందరిలా ఒకడనేనని — గట్టిగా అందరికీ చెప్పాలి చెప్పాలి అనుకుంటూ, గుండె గొంతుకలో కొట్లాడుతుంటే, గుడ్లప్పగించి చూస్తూ వుండిపోయాడు రాజారాం.

తనని వీళ్ళు ఎందుకు ప్రత్యేకంగా చూస్తున్నారు. — తనూ వీళ్ళ రక్తం పంచుకున్నవాడేనే — అందరూ ఒకటైనట్లు తనొక్కడూ ఒకటైనట్లు అనుకున్న రాజారాంకి ప్రపంచమంతా శూన్యంగా వికారంగా కనిపించింది.

వారం రోజులు అక్కడే గడిపిన రాజారాం బయలుదేరుతుంటే బుట్టనిండా అరిసెలు సర్ది పెట్టింది అమ్మ. తనకి ఇవి యిష్టమని అమ్మ మరిచిపోలేదా ఇంకా —

'బాబాయ్ — మళ్లీ రా' చిన్న తియ్యని గొంతు, ఒక్క ఉత్తరంముక్క రాయరా బాబూ — నీళ్ళు నిండిన కళ్ళతో అమ్మ చూపు — కదిలిపోతున్న రాజారాంని క్షణం కట్టివేసాయి. ఈ ఆప్యాయతలు తను భరించలేకపోతున్నాడు. — ముందుకేస్తున్న అడుగులో మార్గం కనిపించకుండా కన్నీళ్ళు అలుముకున్నాయి. ఈ ఆప్యాయతల్ని ఏ డబ్బుతో కొనుక్కోగలను!! — లక్షాధికారి రాజారాం దీర్ఘంగా నిట్టూర్చి ఆ నిశీధిలో కలసిపోయాడు.